క్లుప్తంగా

నిజాయతీ చాటిన 108 సిబ్బంది


సీఐకి పర్సు అప్పగిస్తున్న 108 సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాల 108లో పనిచేస్తున్న డ్రైవర్ రాజేందర్, ఈఎంటీ నరేశ్ నిజాయతీ చాటుకున్నారు. శుక్రవారం ధరూర్ క్యాంప్‌లోని రామాలయం వద్ద 108 వాహనాన్ని పార్కింగ్ చేసుకుని ఉండగా, వీరికి సమీప ప్రాంతంలో విలువైన కార్డులున్న పర్సు దొరికింది. పట్టణ సీఐ వేణుగోపాల్‌కు అప్పగించారు.

‘కథలాపూర్ మిర్చి భలే ఘాటు గురూ’


మిర్చి తింటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: మండలకేంద్రంలోని చౌరస్తా వద్ద శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్థానిక నాయకులతో సమస్యలపై చర్చించారు. అక్కడే హోటల్‌లో ఉన్న మిరపకాయ బజ్జీలు తిని రుచి చూశారు. కథలాపూర్ మిరపకాయ బజ్జీలు భలే ఘాటు.. గరం గరంగా ఉన్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చమత్కరించడంతో కాంగ్రెస్ నాయకులు నవ్వారు.

హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

జగిత్యాల: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు సుదీర్‌కుమార్ అన్నారు. బీఎంఎస్ 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 కోడ్‌లలో 2 కోడ్‌లను స్వాగతిస్తున్నామని, కనీస వేతనాలు కార్మికులకు వెంటనే అమలు చేయాలన్నారు. హమాలీ సంక్షేమ బోర్డు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నక్క అశోక్, గంగారాం, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రదర్శన విజయవంతం చేయాలి


నినాదాలు చేస్తున్న కళాకారులు

కోరుట్ల: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు, లక్ష డప్పుల ప్రదర్శన విజయవంతం చేయాలని ప్రదర్శన కళాకారుల జిల్లా అధ్యక్షుడు మారంపల్లి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కళా ప్రదర్శనలో జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల కవులు, గాయకులు, డప్పు కళా బృందాలు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగిలి స్వామి, వనతడుపుల అంజయ్య, ఎర్ర శంకర్, మోర్తాడ్ రాజశేఖర్, కంటాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు విరమించుకోవాలి

జగిత్యాల: సమగ్ర శిక్ష జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం సరికాదని, వెంటనే విరమించుకోవాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్చలు జరిపాలని, ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో ఉద్యమాన్ని నీరుగార్చవద్దన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సాగర్ ఉన్నారు.

ఉత్తర్వులు రద్దు చేయాలి

జగిత్యాలరూరల్: ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొక్కుల రాంచంద్రం డిమాండ్ చేశారు. సర్దుబాటు పేరుతో ఉద్యమాన్ని నీరుగార్చుతున్నారన్నారు. కార్యక్రమంలో పీటీఎఫ్ జిల్లా కార్యదర్శి గోవర్దన్ ఉన్నారు.

‘డ్రమ్‌సీడర్’ సాగుతో అధిక దిగుబడి

- కూలీల సమస్యకు చెక్.. తగ్గనున్న పెట్టుబడి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


చిట్టాపూర్‌లో డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి సాగును పరిశీలిస్తున్న ఏఈవో, రైతులు(ఫైల్)

మల్లాపూర్: యాసంగి సీజన్‌లో వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు నారు పెంచి, కూలీలతో నాట్లు వేయిస్తుంటారు. దీంతో సమయం, పెట్టుబడి పెరుగుతుంది. కాబట్టి రైతులు వరి విత్తనాన్ని డ్రమ్ సీడర్ పద్ధతిలో నేరుగా విత్తుకుంటే.. కూలీల సమస్యను అధిగమించి, పెట్టుబడులు తగ్గించుకుని అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

- డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి రకాన్ని బట్టి ఎకరాన 10–15 కిలోలు అవసరమవుతాయి.
- పొలంలో నీరు నిలువ ఉండకూడదు. కాబట్టి నీరు ఎక్కువైతే బయటికి పోవడానికి ఏర్పాట్లు చేయాలి. పెద్దగా ఉన్న పొలాలను చిన్న మడులుగా విభజించుకుని చదును చేయడానికి, నీరు పెట్టడానికి, విత్తనం విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.
- విత్తే సమయానికి నీరు లేకుండా చూసుకోవాలి.
- ఇసుక నేలలో విత్తాలనుకున్న రోజే ఆఖరి దమ్ము చేసి, మండె కట్టి మొలక వచ్చిన విత్తనాలను విత్తుకోవాలి.
- డ్రమ్ డర్ పద్ధతిలో ఒక ఎకరం విత్తనానికి ఇద్దరు కూలీలు అవసరమవుతారు.
- లీటర్ నీటికి గ్రాము చొప్పున కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో విత్తనాలు 12 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టి, కొద్దిగా కొమ్ము పలిగిన గింజలను డ్రమ్ సీడర్ ద్వారా విత్తుకోవచ్చు.
- నారుమడిలో నీటి యాజమాన్యం ఏ విధంగా చేస్తామో, వరి మొదటి దశల్లో అదే పద్ధతిని అవలంభించాలి.
- అనివార్య కారణాలతో కుదురులోని గింజలు 50 శాతం దెబ్బతిన్నా, మిగిలిన 50 శాతం గింజల నుంచి వచ్చిన మొక్కల సాంద్రత సరిపోతుంది.
- సన్న గింజ రకాలకు రంధ్రం వదిలి మరో రంధ్రాన్ని మూసివేయాలి.
- ప్రతీ 16 వరుసలకు అడుగు వెడల్పు కాలిబాటలు ఉంచుకోవాలి.
- తాడు వాడి డ్రమ్ లాగితే వరుసలు బాగావస్తాయి. కోనోవీడర్ తిప్పడానికి వీలుగా ఉంటుంది.
- సాధారణ సాగు కన్నా ఈ పద్ధతిలో పంట దిగుబడి అధనంగా వస్తుంది.
- సాళ్లల్లో కోనోవీడర్ ద్వారా కలుపు తీస్తే, ఈ కలుపు పంటకు పచ్చిరొట్ట ఎరువవుతుంది.
- విత్తిన తర్వాత పంట కాలంలో రెండు నుంచి మూడు సార్లు కోనోవీవర్ తప్పితే అధిక పంట దిగుబడి వస్తుంది.

కలుపు నివారణ

విత్తిన మూడో రోజున పైరజోపల్యూరాన్ ఇథైల్ 80 గ్రాములు, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా బెంఫియోకార్బ్ 1.25 లీటర్లు లేదా బులాక్లోర్ + సేఫెనర్ 1.25 ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి విత్తిన 8–10 రోజుల్లోపు పొలంలో పలుచని నీరుంచి చల్లుకోవాలి. దమ్ము చేసిన పొలంలో మండె కట్టిన విత్తనాన్ని పొలమంతా సమంగా పల్చటి నీటి పొర నుంచి వెదజల్లాలి.

డ్రమ్ సీడర్ పద్ధతితో లాభాలు అధికం..

డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తనాలను నేరుగా విత్తుకుంటే కూలీల సమస్య ఉండదు. పంట సాగు పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి పొందవచ్చు. ఈ పద్ధతి ద్వారా రైతులకు లాభాలు అధికం. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు అందిస్తారు.

– సీహెచ్. రాంచందర్, జిల్లా వ్యవసాయ అధికారి, జగిత్యాల

నిర్లక్ష్యంగా డ్రైయినేజీ నిర్మాణం

రాయికల్: పట్టణంలోని 3వ వార్డులో ప్రజలకు మంచినీరు అందించే మున్సిపల్ పైప్‌లైన్ నుంచే మురికికాలువ నిర్మాణం చేపట్టడంతో నీరు కలుషితం అవుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేరే నుంచి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
మోహన్, మున్సిపల్ కమిషనర్, రాయికల్ సెల్ నంబర్: 7032118586

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643


యాగంలో పాల్గొన్న భక్తులు

కొనసాగుతున్న యాగం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేట లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శతచండీ మహాసుదర్శన నారసింహ యాగం కొనసాగుతోంది. దీనిలో భాగంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. యాగంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ఘనంగా అయ్యప్ప మండల పూజ


ధర్మపురి: అయ్యప్ప పడిపూజలో భక్తులు

ధర్మపురి: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప మండల పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు పెండ్యాల బాలకృష్ణస్వామి మంత్రోచ్చారణలతో పడిపూజ నిర్వహించారు. స్థానిక శ్రీ సాయి శివ బాలాజీ మందిరంలో ఒజ్జల ప్రవీణ్ శాస్త్రి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు భీమనాథి మంగ అశోక్, అర్చకులు, వివిధ మండలాలకు చెందిన అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని చిల్వాకోడూర్‌లో తాండ్ర వినోద –లక్ష్మణ్‌గౌడ్ ధర్మకర్తల ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప ఆలయం గుట్టపై నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మెట్ల పూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీఅయ్యప్పస్వామి పేటతుల్లి ఆటలు, నృత్యాలు, పాటలతో, అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి చౌడాల వినోద్ నేతృత్వంలో వందలాది అయ్యప్ప దీక్షదారులు హాజరవగా, శరణుఘోషతో ఆ ప్రాంగణమంతా మారుమోగింది. సంఘం అధ్యక్షుడు చౌడారపు శ్రీనివాస్ పడిపూజకు అన్ని ఏర్పాట్లు చేసి, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివ శ్రీనివాస్, శివ రాంకిషన్, సభ్యులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

రాయికల్: మండలంలోని చింతలూరులో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విగ్రహాల ఊరేగింపు, పుణ్యాహవచనం, అఖండ దీపారాధరణ, అగ్నిస్థాపన, వాస్తు, యోగిని, నవగ్రహ, క్షేత్రపాలక సర్వతో భద్ర మండలం జలాదివాసం పూజా కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ప్రభాకర్, భూమారావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

జగిత్యాల/జగిత్యాలరూరల్/జగిత్యాలజోన్/కోరుట్ల/మెట్‌పల్లి/కథలాపూర్/పెగడపల్లి: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. జిల్లా కేంద్రం, మండ కేంద్రాలు, గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు. ఆర్థిక వేత్తగా, దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, న్యాయవాదులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


కథలాపూర్‌లో మన్మోహన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విప్, నాయకులు


జగిత్యాలలో నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి


కోరుట్లలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


వేంపేటలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


పెగడపల్లిలో కాంగ్రెస్ నాయకుల నివాళి

మా టీచర్లు మాకే కావాలని విద్యార్థినుల ధర్నా


కేజీబీవీలో ధర్నా చేస్తున్న విద్యార్థినులు

వెల్గటూర్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల సిబ్బంది తమ రెగ్యులరైజేషన్ కోరుతూ 18 రోజులుగా ధర్నా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరు పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడకుండా ఉండేదుకు విద్యాశాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మండలంలోని పలువురు మహిళా ఉపాధ్యాయులకు కేజీబీవీల్లో బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో గొడిసెలపేట బీసీ కాలనీలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సుశీలను కేజీబీవి ఇన్‌చార్జీగా నియమించడంతో విధుల్లో చేరేందుకు శుక్రవారం ఆమె పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థినులు ఆమె రాకను వ్యతిరేకించడంతో ఎంఈవో ప్రభాకర్ డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఈవో రాము పాఠశాలకు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడి, వారితో కలిసి భోజనం చేసి పరిస్థితిని సమీక్షించి వెళ్లారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సారంగాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పంచాయతీ కార్మికులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులి మల్లేశం, గంగారాం, గంగ లచ్చన్న, లక్ష్మీరాజం, నిర్మల గంగమ్మ, లక్ష్మీ, సుందర్, లచ్చయ్య, పోచయ్య, పోచమ్మ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

మల్లాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో శుక్రవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. పద్మశాలీ సంఘం భవన నిర్మాణం కోసం మంజూరైన ఎంపీ ల్యాండ్ నిధులు రూ.4లక్షల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ప్రధాని మోదీసుపరిపాలనతో దేశం అన్నిరంగాల్లో పురోగతి సాధిస్తుందన్నారు. స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో బీజేపీయే గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు యాదగిరి బాబు, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, మండల ఉపాధ్యక్షుడు లవ ంగ శివకుమార్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి

సారంగాపూర్: యాదవుల సమస్యల పరిష్కారానికి ఎన్నికైన ప్రతినిధులు కృషిచేయాలని యాదవ సంఘ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని పోతారం గ్రామానికి చెందిన అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధి భైరి మల్లేశం, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బల్కల మల్లేశం యాదవ్‌ను అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు పల్మార్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో రాజారాం యాదవ్, బొబ్బిలి వెంకటస్వామి, బండ మల్లేశ్, ఏరవేణి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వేంపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేటలో లయన్స్ క్లబ్ ఆఫ్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు సుమారు 300 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 40 మందికి కంటి ఆపరేషన్ అవసరమున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ తెలిపారు. రాకేశ్, వేణుగోపాల్, శంకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, రాజమల్లయ్య, గంగాధర్, మహేందర్‌రెడ్డి, శేఖర్, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు జిరాక్స్ మిషన్, ప్రింటర్ వితరణ

కథలాపూర్: మండలంలోని కలిగోట ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన తరి రాకేశ్ జిరాక్స్ మిషన్, ప్రింటర్‌ను శుక్రవారం అందించారు. చదువుకున్న పాఠశాలకు ఎదైనా అందించాలని జిరాక్స్ మిషన్, ప్రింటర్‌ను అందించినట్లు రాకేశ్ తెలిపారు. దాత రాకేశ్‌ను ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు గంగారెడ్డి, రాధాకృష్ణ అభినందించారు.

డ్రైయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో డ్రైయినేజీ నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ.15 లక్షలు మంజూరు చేయించినట్లు మార్కెట్ డైరెక్టర్ జవ్వాజి చౌదరి శుక్రవారం తెలిపారు. ఏళ్ల నాటి సమస్య తీరనుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: విజయవాడలో జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో పాల్గొనేందుకు ఆహ్వానం వచ్చినట్లు మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుర్కాజీ కటకం కవిత తెలిపారు. ఈ నెల 28,29వ తేదీల్లో జరగనున్న కవి సమ్మేళనంతో పాటు సాహితిసదస్సులో పాల్గొంటారు. ప్రపంచ వేదికపై అవకాశం లభించడంపై పలువురు సాహితి అభిమానులు కవితకు అభినందనలు తెలిపారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం


నిరసన తెలుపుతున్న నాయకులు

మల్లాపూర్: బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివాదాస్పద వ్యాఖ్యలు గర్హనీయమని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సంగెం–శ్రీరాంపూర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అమిత్ షా దిష్టిబొమ్మ వారు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అమిత్‌షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు జంగం దినేష్, మోర్తాడ్ అన్వేష్, బబ్బూరి రాజేందర్, మహేష్, విజయ్, నరేందర్, మహేందర్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ధర్మపురి: ప్రమాదవశాత్తు కింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన సమ్మెట పోశయ్య (75) ఈనెల 22న ఇంట్లో విద్యుత్ వైరు సవరిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. అతడి తలకు, ఛాతిలో గాయాలు కావడంతో 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయమించడంతో 26న మృతిచెందాడు. మృతుడి కుమారుడు మల్లేశ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెట్‌పల్లి మండలంలో ఒకరు..

మెట్‌పల్లిరూరల్: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల గ్రామానికి చెందిన సంద సురేశ్(38) ఈ నెల 24న మెట్‌పల్లి వైపు కారులో వెళ్తుండగా, అతివేగంతో ఎదురుగా వస్తున్న ఓ ట్రాక్టర్ కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన సురేశ్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సురేశ్‌కు భార్య, కూతురు ఉన్నారు.

ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధం

మేడిపల్లి: భీమారం మండలంలోని వెంకట్రావుపేటలో మైదం నర్సయ్యకు చెందిన పశువుల కొట్టం శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించగా, సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలు ఆర్పారు.